క్లుప్తంగా

చెత్త రహిత సమాజాన్ని నిర్మిద్దాం



స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్‌లో పాల్గొన్న ఎంపీడీవో

గుడిపాల: అందరూ కలిసి చెత్త రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎంపీడీవో కుమార్ తెలిపారు. గుడిపాలలో గురువారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటా చెత్తను సేకరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా ఇళ్ల వద్దకు వచ్చే కార్మికులకు అందజేయాలన్నారు. అనంతరం గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో శ్రమదానం చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



సేవా కార్యక్రమంలో ఎన్‌సీసీ కేడెట్లు

చిత్తూరు కలెక్టరేట్ : పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుని బాధ్యత అని ఆర్మీ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ లోకనాథన్ తెలిపారు. 35 ఆంధ్ర బెటాలియన్, పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్‌ల ఆధ్వర్యంలో గురువారం పాత కలెక్టరేట్‌లో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించాల్సిన బాధ్యత ఎన్‌సీసీ కేడెట్లపై ఉందన్నారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల కలిగే అనర్థాల నుంచి బయటపడటమే లక్ష్యంగా స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం పాత కలెక్టరేట్‌లోని ప్లాస్టిక్, పాలథిన్ కవర్‌లను ఎన్‌సీసీ కెడెట్‌లు తొలగించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ రమేష్, పీవీకేఎన్ కళాశాల ఎన్‌సీసీ కేడెట్‌లు, ఆర్మీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నతాశయంతో విద్యనభ్యసించాలి



పుస్తకాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్ : విద్యార్థులు ఉన్నత ఆశయంతో విద్యనభ్యసించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు తెలిపారు. జన సంఘ్ వ్యవస్థాపకులు దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని గురువారం ఆ పార్టీ నగర సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం టీవీ నాయుడు వీధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు భగవద్గీత, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు అందజేశారు. జగదీశ్వరనాయుడు మాట్లాడుతూ విద్యార్థులు గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ దుర్గ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు రామభద్ర, గోకుల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా అంబులెన్స్ సేవలు

పలమనేరు: పలమనేరు పట్టణ వాసులకు లయన్స్ క్లబ్ ద్వారా ఉచితంగా అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు నిర్వాహకులు సత్యప్రకాష్ తెలిపారు.అవసరమైన వారు వాహనానికి డీజిల్ పోసుకుని, డ్రైవర్‌కు బత్తా చెల్లించి వినియోగించుకోవాలని సూచించారు. అందులో ఆక్సిజన్ సౌకర్యం కూడా వుందన్నారు.



జీఎన్‌ఆర్‌పేట సమీపంలోని ఓ ఫ్యాక్టరీ నుంచి వంకలో వదిలిసిన కలుషిత నీరు(ఫైల్)



దిగువమాసాపల్లి ప్రాంతంలో ఉన్న ఓ ఫ్యాక్టరీ వ్యర్థాలు (ఫైల్)

కాటేస్తున్న కాలుష్యం

అభివృద్ధిలో భాగంగా పరిశ్రమలు రావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. అవే పరిశ్రమలు కాలుష్యానికి కారకాలుగా మారితే ఇబ్బందులు తప్పవు. చిత్తూరు మండలంలో వున్న ఫ్యాక్టరీలను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారు. పరిశ్రమల నుంచి వచ్చే నల్లటి పొడి ఇళ్లు, చెట్లు, పంట పొలాలను కమ్మేస్తోంది. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా నిర్వాహకులు పట్టించుకోవడం లేదని, దీంతో పంటలు దెబ్బ తింటున్నాయని రైతులు వాపోతున్నారు.

– చిత్తూరు రూరల్ (కాణిపాకం)

- అస్తవ్యస్తంగా ఫ్యాక్టరీల నిర్వహణ
- పరిశ్రమల నుంచి యథేచ్ఛగా వెలువడుతున్న కాలుష్యం
- వర్షపు నీటి మాటున వ్యర్థజలాలు విడుదల
- పంటలు దెబ్బతింటున్నాయని రైతుల ఆవేదన

- చిత్తూరు మండలం ముత్తుకూరు ప్రాంతంలోని ఓ ఫ్యాక్టరీ నుంచి రాత్రిళ్లు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. డంపింగ్ యార్డును తలపిస్తోంది. వర్షాకాలంలో ఈ వ్యర్థాలు కాలువల ద్వారా చెరువుల్లోకి కొట్టుకుపోతున్నాయి.
- చెర్లోపల్లిలోని ఓ ఫ్యాక్టరీ వద్ద కలుషిత నీరు చెరువును తలపిస్తోంది. ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థాలతో పాటు వర్షపు నీరు కలిసిపోయింది. అటువైపు వెళ్లే ప్రజలు ముక్కులు మూసుకోవాల్సి వస్తోంది. పాములు బుసకొడుతున్నాయని పాదచారులు భయాందోళన చెందుతున్నారు.
- ఫ్యాక్టరీలు ఇష్టానుసారంగా వ్యర్థాలను చెరువులు, కాలువల్లో కలిపేస్తున్నాయి. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. టాస్క్‌ఫోర్స్ టీం, సభ్యులు పనిచేస్తున్నట్లు కనిపించడంలేదు. అడిగితే డిప్యూటీ సీఎం పేరు చెబుతున్నారు. ఆయనను కలవాలని చెబుతున్నారు. వారు పనిచేసేటట్టు మందలిస్తే బాగుంటుంది.

– అసెంబ్లీలో ఓ ఎమ్మెల్యే గళం

చిత్తూరు మండలంలోని 16 వరకు వివిధ పరిశ్రమలున్నాయి. వీటిలో కొన్ని నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయి. బీఎన్‌ఆర్‌పేట, ముత్తుకూరు సమీపంలోని ఫ్యాక్టరీలు వర్షపు నీటి మాటున వ్యర్థాలను బయటకు వదులుతున్నాయి. దుర్గంధంతో పాటు నల్లటి పొగ వల్ల ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. అంతేగాక కలుషిత నీరు చెరువులు, కుంటల్లో చేరుతోంది. వర్షం పడిన ప్రతిసారీ కలుషిత నీరు రంగుమారి బయటకు వస్తోంది. చెడు వాసనను ప్రజలు భరించలేక పోతున్నారు. చర్మవ్యాధులు, శ్వాస సంబంధిత సమస్యలు, కంటి ఇన్‌ఫెక్షన్లు వంటి సమస్యల బారిన ప్రజలు పడుతున్నారు. రైతులు సాగు చేస్తున్న పంటలు ఎండిపోతున్నాయి. దీనిపై ఫిర్యాదు చేసినా పొల్యూషన్ బోర్డు అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వెలువెత్తుతున్నాయి.

పర్యవేక్షణ లోపం...

పరిశ్రమల్లో నిల్వ చేసిన వ్యర్థాలను శుద్ధి చేయకుండా బయటకు పంపుతున్నారు. వర్షపు నీటితో పాటు రసాయన వ్యర్థాలు బయటకు పంపిస్తున్నా మండల, కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు చూసీచూడనట్టుగా వ్యవరిస్తున్నారు. పరిశ్రమల నిర్వహణను పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. వర్షపు నీటితో రసాయన మిశ్రమాలను విడుదల చేస్తే పరిశ్రమలపై కేసులు నమోదు చేయాలి. అలా జరగడం లేదని స్థానికులు వాపోతున్నారు. నీటి కలుషితంపై కొన్ని నెలల క్రితం ముత్తుకూరు, దిగువమాసాపల్లి రైతులు ఆందోళన చేశారు. దీంతో కొన్ని నెలల పాటు ఫ్యాక్టరీని మూసేశారు. అలాగే కొన్నేళ్ల క్రితం ఒక రసాయన ఫ్యాక్టరీ వల్ల పంటలు సాగు కావడం లేదని రైతులు రోడ్డెక్కారు. ఇప్పుడు కూడా మండలంలోని కొన్ని ఫ్యాక్టరీలు నిబంధనల అతిక్రమిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ముత్తుకూరు వద్ద ఫ్యాక్టరీ వ్యర్థాలు

ఫిర్యాదులు వస్తే చర్యలుంటాయి.

ఫ్యాక్టరీలు కచ్చితంగా నిబంధనలు పాటించాలి. కాలుష్య నియంత్రణను అనుసరించాలి. నింబధనలు అతిక్రమిస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. ఎవరైనా కలుషితం చేస్తున్నట్లు తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిశీలించి తగిన విధంగా స్పందిస్తాం.

– రాజశేఖర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పర్యావరణ ఇంజినీర్, చిత్తూరు

ఈ-పంట నమోదు వేగవంతం



ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న మురళీకృష్ణ

గుడిపాల: ఈ-పంట నమోదును వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ మురళీకృష్ణ ఆదేశించారు. ఆయన గురువారం గుడిపాల, కమ్మతిమ్మాపల్లె, ఏఎల్‌పురంలో జరుగుతున్న ఈ-పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గుడిపాల మండలంలో 50,931 సర్వే నంబర్లకు గాను ఇప్పటివరకు 1900 సర్వే నంబర్లలో నమోదు ప్రక్రియ పూర్తయిందన్నారు. ఈ నెల 30వ తేదీలోగా పంట నమోదును పూర్తి చేయాలన్నారు. మామిడి పంటకు సంబంధించి ఫ్యాక్టరీల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్లను నియమించడంతో ఈ-పంట నమోదు ఆలస్యమైందని చెప్పారు. రైతులకు అన్ని పథకాలు వర్తించాలంటే ఈ-పంట నమోదు తప్పనిసరని, ప్రతి ఒక్క రైతూ ఈ-పంటలో నమోదు చేయించాలని ఏవో సంగీతకు సూచించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు పుష్పాంజలి, దీపక్‌రెడ్డి, లావణ్య పాల్గొన్నారు.

పెరటి కోళ్లకు కొక్కెర తెగులు నివారణ టీకాలు



కోడికి టీకా వేస్తున్న పశువైద్యాధికారి

గుడిపాల: పెరటి కోళ్లకు కొక్కెర తెగులు నివారణ టీకాలు వేస్తున్నట్లు గుడిపాల పశువైద్యాధికారి సాయిసుధ తెలిపారు. ఆమె గురువారం కొత్త కోట గ్రామంలో గురువారం పెరటి కోళ్లకు టీకాలు వేశారు. ఆమె మాట్లాడుతూ కొక్కెర వ్యాధి సోకిన కోళ్లలో తల గుండ్రంగా తిప్పడం, కళ్లు వాపు రావడంతో ఆకస్మిక మరణం సంభవిస్తుందన్నారు. రైతులు తప్పనిసరిగా కోళ్లకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు.

సర్వే శాఖ డీడీగా జయరాజ్



డీడీగా ఉద్యోగోన్నతి పొందిన జయరాజ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా సర్వే శాఖ ఏడీగా విధులు నిర్వహిస్తున్న జయరాజ్‌కు ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా ఉద్యోగోన్నతి లభించింది. ఆయన గురువారం కలెక్టరేట్‌లో నూతన డీడీగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ గ్రామసభల్లో 16,114 అర్జీలు, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన 2189 అర్జీలను పరిష్కరించినట్లు తెలిపారు. ఆఫ్‌లైన్‌లో 8577 అర్జీలు రాగా 7161 ఆమోదం పొందాయన్నారు. పలు కారణాలతో 986 తిరస్కరణకు గురయ్యాయని తెలిపారు. 430 అర్జీలు పరిష్కరించాల్సి ఉందన్నారు. పట్టా సబ్ డివిజన్‌కు 897 అర్జీలు రాగా 595 ఆమోదం పొందాయని, 252 తిరస్కరించినట్లు తెలిపారు. 50 అర్జీలు పెండింగ్‌లో వున్నట్లు చెప్పారు. రీ సర్వే తర్వాత 33,481 జాయింట్ ఎల్‌పీఎం ఖాతాలను సృష్టించామన్నారు. ఎల్‌పీఎం విభజనకు 4140 మంది రైతులు రుసుము చెల్లించారని పేర్కొన్నారు. ఇందులో 3529 అర్జీలను పరిష్కరించగా 611 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎల్‌పీఎం విభజనకు 18,976 దరఖాస్తులు అనర్హమని, 10,365 మంది విభజనకు సముఖంగా లేరని వెల్లడించారు. మొదటి దశ రీసర్వేను 31 గ్రామాల్లో 30 వేల ఎకరాల్లో చేశామన్నారు. రెండవ దశలో 38 గ్రామాల్లో 40 వేల ఎకరాల్లో, మూడవ దశలో 303 గ్రామాల్లోని 2.54 లక్షల ఎకరాల్లో రీసర్వే పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. ఆయనను పలువురు సిబ్బంది ఘనంగా సత్కరించారు.

మాల్‌లో తినుబండారాల చోరీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ఓ మాల్‌లో నెలల తరబడిగా తిను బండారాలు చోరీ చేస్తున్నారనే ఫిర్యాదుపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. నగరంలోని వేలూరు రోడ్డులో ఉన్న ఓ మాల్‌లో కూరగాయలు, ఆహార పదార్థాలు ఇతర వస్తువుల్లో తేడా వస్తోందని నిర్వాహకులు గుర్తించారు. సీసీ పుటేజీని పరిశీలించగా తమ వద్ద పనిచేసే వ్యక్తి చోరీ చేసి తీసుకెళుతున్నట్లు గుర్తించారు. దీంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

క్యాన్సర్‌తో అప్రమత్తంగా ఉండాలి

తవణంపల్లె: క్యాన్సర్‌తో అప్రమత్తంగా ఉండాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. ఆయన గురువారం పల్లెచెరువులో మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ మహిళలు రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయం క్యాన్సర్‌పై జాగ్రత్తగా వుండి పరీక్షలు చేయించుకోవాలన్నారు. పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టిసారించాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మహిళలు ఆరోగ్యంపై దృష్టిసారించాలని వైద్యులు దిలీప్‌కుమార్ తెలిపారు. చిత్తూరు నగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం మహిళలు, కిశోర్ బాలికలకు పలు రకాల పరీక్షలు చేశారు. మందులను అందజేశారు. డాక్టర్ మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా వుండవచ్చని తెలిపారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది గోపి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

యాదమరి: స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కింద నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పార్థసారథి తెలిపారు. ఆయన గురువారం ఎంపీడీవో రవీంద్రతో కలిసి సంతగేటులోని పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలంటే క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎంపీడీవో రవీంద్ర మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాలు రాకుండా నివారించవచ్చన్నారు. అనంతరం ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా ఫార్మసిస్ట్ శైలశ్రేణిని సీహెచ్‌వో శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మీపతి, సెల్వరాణి, సహాయకులు సురేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వీధి విక్రయదారుల ఆర్థికాభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్: వీధి విక్రయదారుల ఆర్థికాభివృద్ధి కోసమే పీఎం స్వానిధి 2.0 లోక్ కళ్యాణ్ మేళా కార్యక్రమం చేపట్టినట్టు చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ చెప్పారు. ఆయన గురువారం లోక్ కళ్యాణ్ మేళాపై బ్యాంకు అధికారు లు, మెప్మా ఆర్పీలు, సీవోలతో సమావేశమయ్యా రు. ఆయన మాట్లాడుతూ అర్హులైన, గుర్తింపు పొందిన వీధి విక్రయదారులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ రవీంద్ర, సహాయ కమిషనర్ ప్రసాద్, మెప్మా డీపీఎంయు రవి, సీఎంఎం గణేష్, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

పాహిమాం.. అన్నపూర్ణాదేవి



ఐరాల : అన్నపూర్ణాదేవి అలంకరణలో పాలేటమ్మ

ఐరాల: మండలంలో దసరా శరన్నవరాత్రి వేడుకలు కనుల పండువగా జరుగుతున్నాయి. అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు గురువారం స్థానిక పాలేటమ్మ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వైఎస్.గేటులో చాముండేశ్వరి అమ్మవారు బాలా త్రిపుర సుందరిగా భక్తులను అనుగ్రహించారు. పాతపాళ్యంలో ఓం శక్తి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా పూజలందుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

శైలపుత్రి నమోనమామి

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని పలు ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గిరింపేటలోని దుర్గాంబ అమ్మవారిని పార్వతీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ చైర్మన్ దిలీప్‌రెడ్డి, ఈవో తిమ్మారెడ్డి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కోదండరామస్వామి కూర్మావతారంలోనూ, సాయిబాబా ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు భక్తులను కటాక్షించారు. వీరాంజనేయస్వామి ఆలయంలో హయగ్రీవస్వామి అలంకారం, బ్రహ్మకుమారీస్ కేంద్రంలో శీతలాదేవి అలంకారంలో అమ్మవారు అభయమిచ్చారు.

లలితా త్రిపుర సుందరిగా ముత్యాలమ్మ

బంగారుపాళెం: బంగారుపాళెంలో గ్రామదేవత ముత్యాలమ్మ గురువారం లలితా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమూర్తి, అర్చకులు మురళీగురుకుల్ భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వజ్రాలపురం బోయకొండ గంగమ్మ గురువారం లలితా త్రిపుర సుందరిదేవి అలంకారంలో భక్తులను కటాక్షించారు. ఆలయ ధర్మకర్త కృష్ణప్ప, ఆలయ మేనేజర్ మొగిలప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పార్వతీదేవి అలంకారంలో దుర్గమ్మ

గుడిపాల: మండలంలోని కందగిరి కొండవద్ద ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఉన్న మూలస్థాన దుర్గమ్మ గురువారం పార్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం మహిళలు కుంకుమార్చన చేశారు. పిళ్లారికుప్పంలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో అమ్మవారు కాత్యాయణిదేవిగా భక్తులను అనుగ్రహించారు.

సత్యమ్మకు విశేష పూజలు

తవణంపల్లె: మండలంలోని కె.పట్నంలో వెలసిన సత్యమ్మను గురువారం పసుపు, కుంకుమ, గంధంతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.



చిత్తూరు నగరంలోని బాబా ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకారం



చిత్తూరు రూరల్ : పార్వతీదేవిగా దుర్గాంబ



బంగారుపాళెం: లలితా త్రిపుర సుందరిగా ముత్యాలమ్మ.



బంగారుపాళెం: వజ్రాలపురం బోయకొండలో..



గుడిపాల: కాత్యాయనీ దేవిగా ద్రౌపదీ అమ్మవారు

పోషకాహారంతో ఆరోగ్య సమాజం



మాట్లాడుతున్న బాలసూర్యనారాయణ

గుడిపాల: పిల్లలకు పోషకాహారం అందించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని సీహెచ్‌వో బాల సూర్యనారాయణ తెలిపా రు. రామభద్రాపురం పంచాయతీలో గురువా రం రాష్ట్రీయ పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బిడ్డ పుట్టగానే తల్లి ముర్రు పాలు పట్టించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పిల్లలకు ఆరు నెలలు తప్పనిసరిగా తల్లిపాలు తాగించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తోయాద్రాక్షి, అంగన్‌వాడీ టీచర్స్ అన్నెమ్మ, విజయ, కోకిల, మంజులలు పాల్గొన్నారు.